సాక్షి బాపట్ల

శుక్రవారం । 16 । ఆగస్టు । 2024




పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ గురువారం సాయంత్రానికి 44.20 టీఎంసీలకు చేరింది. దిగువకు 25,399 క్యూసెక్కులు వదిలారు.



నోటు పుస్తకాలు పంపిణీ

నిజాంపట్నం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం శివపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తహసీల్దార్ షాకీర్ పాషా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 7026 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 2860 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

వీరుల త్యాగఫలమే స్వాతంత్య్రం

కలెక్టర్ వెంకట మురళి



బాపట్ల: వీరుల త్యాగఫలమే మనం ఇప్పుడు అనుభవిస్తున్న స్వాతంత్య్రమని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌పై జాతీయ జెండాను కలెక్టర్ ఎగురవేశారు. త్రివర్ణ పతాకానికి ఆయన వందనం చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మహనీయుల త్యాగాల స్ఫూర్తితో ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.సత్తిబాబు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి ఆటల పోటీలు

నరసరావుపేట ఈస్ట్: విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్‌లో భాగమైన సరస్వతి శిశు మందిర్ విద్యాసంస్థల రాష్ట్రస్థాయి ఆటల పోటీలు ఈనెల 17, 18 తేదీలలో నిర్వహిస్తున్నట్టు పాఠశాల సమితి అధ్యక్షుడు మిరియాల నాగప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఐదు జోనల్స్‌లో గెలుపొందిన దాదాపు 700మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పోటీలను ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీలలో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులు సౌత్ సెంట్రల్ పోటీలకు, అక్కడ విజయం సాధించన వారు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారనీ, జాతీయ స్థాయిలో విజయం సాధించిన వారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

కిటకిటలాడిన ఆర్టీసీ బస్టాండ్



నరసరావుపేట ఈస్ట్: వరుస సెలవులు రావటంతో సొంత గ్రామాలకు వెళ్లే విద్యార్థులతో నరసరావుపేట బస్టాండ్ కళకళలాడింది. స్వాతంత్య్ర దినోత్సవం, వరలక్ష్మీ వ్రతం, వీకెండ్స్, రాఖీ పూర్ణిమ ఇలా వరుసగా సెలవులు రావటంతో విద్యార్థులు ఉత్సాహంగా సొంత గ్రామాలకు తరలివెళ్లారు. వీరికి తోడు వివిధ కారణాలతో గ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి.

నేడు భ్రమరాంబ అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ

పెదకాకాని: పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని భ్రమరాంబ అమ్మవారిని పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో దేవస్థానానికి విచ్చేసి శ్రీ భ్రమరాంబ అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు. శ్రావణమాస మూడో శుక్రవారం భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేకంగా మల్లెపూల అలంకరణ, నాల్గవ శుక్రవారం లక్ష గాజులతో శ్రీ భ్రమరాంబ అమ్మవారిని ప్రత్యేక అలంకరిస్తామని తెలిపారు.

నేడు వరలక్ష్మీదేవిగా దుర్గమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ వారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. వరలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు 70 వేల పైబడి భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

సెల్‌ఫోన్లు తీసుకురావొద్దు..

ఆలయ ప్రాంగణంలోకి సెల్‌ఫోన్లు తీసుకురావడం నిషేధమనే విషయాన్ని భక్తులు గుర్తించాలని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం క్యూలైన్‌లోకి ప్రవేశించే ముందే తమ సెల్‌ఫోన్లను కౌంటర్లలో భద్రపరుచుకోవాలని సూచిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్ వినియోగించినా, అమ్మవారి మూలవిరాట్‌ను ఫొటోలు తీసినా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ప్రతిరంగాన ప్రగతే లక్ష్యం

- హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం
- రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్
- జిల్లా కేంద్రంలో పతాకావిష్కరణ
- వెల్లివిరిసిన స్వాతంత్య్ర స్ఫూర్తి
- ఊరూవాడా జెండా వందనం
- మదిమదిలో ఉప్పొంగిన దేశభక్తి

ముువ్వన్నెల మెరిసింది. ఊరూవాడా దేశభక్తితో ఉప్పొంగింది. స్వాతంత్య్ర స్ఫూర్తి వెల్లివెరిసింది. జాతీయ జెండా సగర్వంగా రెపరెపలాడింది. జయహో భారత్ అంటూ నినదించింది. బాపట్ల జిల్లా కేంద్రంలో స్వాతంత్య్ర దిన వేడుకలు అంబరాన్నంటాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిరంగాన్ని ప్రగతిబాట పట్టిస్తామని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు.





జెండా ఆవిష్కరణ చేపట్టిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, చిత్రంలో కలెక్టర్ జె.వెంకట మురళి, ఎస్పీ తుషార్‌డూడీ (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవి



బాపట్ల: మహానుభావుల త్యాగం, వీరోచితమైన పోరాటాలు, కృషి ఫలితంగానే స్వాతంత్య్ర ఫలాలు అందుకున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. బాపట్ల జిల్లా కేంద్రంలో స్వాతంత్య్ర వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. పోలీస్ కవాతు మైదానం త్రివర్ణ పతాకాలతో సుందరంగా ముస్తాబైంది. ఆహూతులతో నిండిపోయింది. జయహో భారత్ నినాదాలతో మార్మోగింది. తొలుత రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీసుల కవాతును తిలకించి వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ, జేసీ సుబ్బారావు, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మ, మాలకొండయ్య పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు

మువ్వలు మువ్వన్నెలై మెరిశాయి. దేశభక్తి గీతాలకు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ కట్టిపడేశాయి. వివిధ రంగాల శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఓ విద్యార్థిని భరతమాత వేషధారణతో ఆకట్టుకుంది.

హామీలు అమలు చేస్తాం

అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని చెప్పారు. ప్రజల ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. ఏపీ ప్రభుత్వం రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తోందని చెప్పారు. సమష్టి కృషితో బాపట్ల జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. దీనికి అందరి సహకారం అవసరమని కోరారు. ప్రతిరంగాన ప్రగతి లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.సత్తిబాబు, జిల్లా అధికారులు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, పాల్గొన్నారు.



'స్వచ్ఛ'మేవ జయతే : స్వచ్ఛ సంకల్పం శకటంతో ప్రదర్శన



మువ్వన్నెల మెరుపులు : విద్యార్థుల నృత్య ప్రదర్శన



బడి భోజనం బండి భళే: మధ్యాహ్న భోజన శకటం

జ్ఞాన'జ్యోతి'

- అద్దంకి ఆణిముత్యం జ్యోతి చంద్రమౌళి మాస్టారు
- చారిత్రక పరిశోధన రత్నగా పేరుప్రఖ్యాతులు
- శాసనాల పరిశోధన, గ్రంథ రచన, తాళపత్ర గ్రంథాల అధ్యయనం ఖ్యాతి
- ఎన్నో అవార్డులు, సత్కారాలు, సన్మానాలు



మణికేశ్వరం వద్ద రాతి సమాధిని పరిశీలిస్తున్న చంద్రమౌళి (పాతచిత్రాలు)



తాళపత్రాలను పరిశోధిస్తున్న చంద్రమౌళి


అద్దంకి: విద్వాన్ జ్యోతి చంద్రమౌళి.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పరిచయం అక్కర్లేని పేరు. ఇంటిపేరుకు తగ్గట్టే ఆయన నిత్యం ప్రకాశించే 'జ్యోతి'. చారిత్రక, పురావస్తు పరిశోధకుడిగా కీర్తి గడించిన ఈయన బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు అనే కుగ్రామంలో జన్మించారు. తెలుగు ఉపాధ్యాయునిగా ప్రస్థానాన్ని ప్రారంభించి 24 ఏళ్లపాటు పనిచేశారు. ఉద్యోగ విరమణ తర్వాత చారిత్రక, పురావస్తు పరిశోధకుడిగా మారారు. ప్రస్తుతం అద్దంకి రామనగర్‌లో నివాసం ఉంటున్నారు. రచయితగానూ గుర్తింపు సాధించారు. అనేక ప్రాంతాల్లో పర్యటించి పురాతన గ్రంథాలు, వస్తువులు గుర్తించి అధ్యయనం చేశారు. ఆలయాల్లో, తవ్వకాల్లో లభించిన శాసనాలను క్షుణ్ణంగా పరిశీలించి లిపిని అర్థం చేసుకుని కొత్త ప్రతులను తయారు చేశారు. తాళపత్ర గ్రంథాలను సేకరించి పుస్తక రూపం ఇచ్చారు. కొత్త విషయాలు తెలిస్తే పురావస్తు శాఖకు సమాచారం ఇస్తున్నారు. ఇప్పటికి ఈయన 30 శాసనాలను, ఏడు బౌద్ధ స్థూపాలను గుర్తించారు. పది తాళపత్ర గ్రంథాలకు పుస్తక రూపం ఇచ్చారు. జానపద కళలకు జీవం పోసేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జానపద కళాపీఠం ప్రధాన కార్యదర్శిగా, ప్రకాశం జిల్లా పరిశోధనా సంస్థ అధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ లైఫ్ మెంబర్‌గా, ఏపీ గ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా మెంబర్‌గా, మైసూరు ఆలిండియా థీయో బౌద్ధ ఆర్గనైజేషన్ కార్యవర్గసభ్యుడిగా, ధర్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

చంద్రమౌళి రచనలు

అద్దంకి చరిత్ర, సృజన, సూక్తి కిరణాలు, స్ఫూర్తి రత్నాలు, నేటి భారతం, ప్రకాశం జిల్లా చరిత్ర, దళిత కిరణాలు, జానపద కళలు, మాండుకేశ్వర చరిత్ర, ప్రకాశం జిల్లాలో దర్శనీయ స్థలాలు, అద్దంకి సీమ చరిత్ర, తెలుగు నిఘంటువుతోపాటు 26 గ్రంథాలను రచించారు.

పొందిన అవార్డులెన్నో..

చంద్రమౌళి గతంలో జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. అధికార భాషా సంఘ ప్రతిభా పురస్కారం, ఉత్తమ రచయితగా, ఉత్తమ పరిశోధకునిగా, రెండు సార్లు ప్రకాశం జిల్లా విశిష్ట వ్యక్తిగా గౌరవాలను స్వీకరించారు. మద్రాసులోని ఆంధ్ర కళాసమితి ఉగాది సత్కారం, భారతీయుడు, పరిశోధనా భాస్కర, మద్రాసులోని కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి వారిచే చారిత్రక పరిశోధనా రత్న, జానపద కళానిధి వంటి ఎన్నో అవార్డులు, సన్మానాలు అందుకున్నారు.



త్రివర్ణ సాగరం

విజయపురిసౌత్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం నాగార్జున సాగర్ డ్యాం త్రివర్ణ శోభితమైంది. ప్రత్యేక దీపాలు అమర్చడంతో జలాశయం త్రివర్ణ కాంతులు వెదజల్లుతూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. జలాశయం రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ కృష్ణానదిలోకి 16,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్

- ఆరోగ్యసిబ్బందిపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం
- 'మంచం పట్టిన ముత్తాయపాలెం' కథనానికి స్పందన
- ప్రతి ఇంటికెళ్లి రక్త నమూనాలు సేకరణ
- గ్రామాన్ని సందర్శించిన డీపీఓ రవికుమార్

సాక్షి ఎఫెక్ట్

బాపట్లటౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.విజయలక్ష్మి ఆరోగ్య సిబ్బందిని హెచ్చరించారు. సాక్షిలో 'మంచం పట్టిన ముత్తాయపాలెం' శీర్షికన ప్రచురించిన కథనానికి గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ స్పందించారు. వైద్యశిబిరం నిర్వహించాలని ఆరోగ్యసిబ్బందిని ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికెళ్లి వైద్యపరీక్షలు చేశారు. రక్త నమూనాలను సేకరించి నివేదికల కోసం ల్యాబ్‌కు పంపించారు. గురువారం సాయంత్రం మెడికల్ క్యాంప్‌ను సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊరంతా జ్వరాలు ఉంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిరోజూ 20 గృహాలను సందర్శించాలని ఆదేశిస్తే ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు. జ్వరాలు పూర్తిగా తగ్గేవరకూ ముత్తాయపాలెంలో వైద్యశిబిరం నిర్వహించాలని ఆదేశించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ముత్తాయపాలెం గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వి.రవికుమార్ గురువారం సందర్శించారు. సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపాలని సూచించారు. పారిశుధ్యం మెరుగుపరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.వెంకటేశ్వర్లు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎండీ షఫీ, వైద్యాధికారి గోపి, ఈఓపీఆర్డీ శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీలక్ష్మి, ఏఎన్‌ఎం రూతు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయలక్ష్మి



ముత్తాయపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ రవికుమార్

ముగిసిన జేఎన్‌వీ హ్యాండ్‌బాల్ పోటీలు

ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన వైజాగ్

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా విద్యార్థులు ఎదగాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆకాంక్షించారు. పల్నాడు జిల్లా పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులు నిర్వహించిన ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు అధ్యక్షతన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడారంగంపై కూడా ఆసక్తి చూపాలన్నారు. యూబీఐ నరసరావుపేట రీజియన్ హెడ్ టి.మాధురి మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ సాధినేని హనుమంతరావు, జేఎన్‌వీ విశ్రాంత సహాయక సంచాలకులు సి.ప్రభాకరరెడ్డి, యూబీఐ మేనేజర్ రోహిత్‌సిన్హా, డాక్టర్ రాజశేఖర్‌లు మాట్లాడారు. అనంతరం ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రత్నాంబిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైజాగ్ జేఎన్‌వీకి ఓవరాల్ చాంపియన్‌షిప్

జవహర్ నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ టైటిల్‌ను విశాఖపట్నం జేఎన్‌వీ సాధించింది. క్యాలికట్, కోలార్, మహబూబ్‌నగర్, నెల్లూరు, రాయచూర్, విశాఖపట్నం, షిమోగా, త్రిశూ ల్ ప్రాంతాలకు చెందిన 430 మంది క్రీడాకారులు పాల్గొని హోరాహోరీగా తమ ప్రతిభా నైపుణ్యాలను చాటారు.

అండర్–14, అండర్ –17, అండర్ –19 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ప్రతిరోజు 12 మ్యాచ్‌ల చొప్పున పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో రాష్ట్రానికి చెందిన విశాఖపట్నం జేఎన్‌వీ ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోగా, అండర్ –14 బాలుర విభాగంలో.. విశాఖపట్నం క్లస్టర్, బాలికల్లో కోలార్ క్లస్టర్, అండర్ –17 బాలుర విభాగంలో విశాఖపట్నం, బాలికల్లో కోలార్ క్లస్టర్, అండర్ –19 బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, బాలికల్లో విశాఖపట్నం క్లస్టర్లు ప్రథమస్థానంలో నిలిచి త్వరలో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అర్హత సాధించాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున మొత్తం 72 మంది జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

జిల్లాలో పలువురు పోలీసులు, అధికారులకు ప్రశంసాపత్రాలు



మంత్రి గొట్టిపాటి రవికుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు



సత్తిబాబు, డీఆర్వో | గంధం రవీంద్ర, బాపట్ల ఆర్డీఓ | సూర్యనారాయణ, చీరాల ఆర్డీఓ | హేలాషారోన్, రేపల్లె ఆర్డీఓ | రాజ్ దిబోరా, డీడీ సోషల్ వెల్ఫేర్ | వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీఈఓ | వి.నిర్మల్‌కుమార్, కమిషనర్,బాపట్ల

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖలో విశేష కృషి చేసిన ఉత్తమ పోలీసులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విశిష్ట సేవలు అందించిన 15 మంది జిల్లా పోలీస్ అధికారులకు పతకాల్ని అందజేశారు. ఒకరికి ఏపీ పోలీస్ ఉత్తమ సేవా పథకం, ముగ్గురికి ఏపీ పోలీస్ సేవా పతకాలు, ఆరుగురికి డీజీపీ కమెన్డేషన్ డిస్క్ కాంస్య పతకాలు, ఐదుగురికి డీజీపీ కమాన్డేషన్ డిస్క్‌తో పాటు 44 మందికి ప్రశంసా పత్రాల్ని అందజేశారు.

బాపట్ల టౌన్



సురేష్, మత్స్యశాఖ ఏడీ | రామకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి | వై.పిచ్చిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ | పెరుగు శ్రీనివాసరావు, విద్యుత్ ఏఈ | టి.పి.విఠలేశ్వర్ అడిషనల్ ఎస్పీ | ఎస్. చంద్రమోహన్, ఏఆర్ డీఎస్పీ | షేక్ మౌలుద్దీన్, అడ్మిన్ ఆర్ఐ | వెంకటేశ్వరరావు, బాపట్ల సెబ్ సీఐ | నాయబ్ రసూల్, ఐటీ కోర్ ఎస్ఐ



హరికృష్ణ, ఎస్పీ సీసీ | టి. మురళీకృష్ణ, రేపల్లె డీఎస్పీ | పి. జగదీష్ నాయక్, జిల్లా క్రైమ్ డీఎస్పీ | బాలమురళీకృష్ణ, డీసీఆర్‌బీ సీఐ | శ్రీనివాస్, చుండూరు సీఐ | పి. కృష్ణయ్య, అద్దంకి టౌన్ సీఐ | ఎన్. సత్యనారాయణ, చీరాల రూరల్ సీఐ | సీహెచ్. సింగయ్య, పరిష్కార వేదిక సీఐ | కె. శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ సీఐ | విలియమ్స్, డీఎస్‌ఓ

యూఎస్‌ఏ ఉపాధ్యాయులతో ఐలవరం విద్యార్థుల భేటీ



యుఎస్‌ఏ ఉపాధ్యాయులతో వర్చువల్ ద్వారా మాట్లాడుతున్న విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): అమెరికా సంయుక్త రాష్ట్రంలోని కెరోలినా, భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ విద్యార్థులు వర్చువల్ విధానం ద్వారా గురువారం భేటీ అయ్యారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఖాతీబోసాయక్, గ్లెండా కోవిన్ ఫంక్ (ఇదాహో రాష్ట్రం -యుఎస్‌ఎ)కు ఐలవరం విద్యార్థులు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, నృత్య ప్రదర్శన రూపంలో వివరించారు. గేయాలు, ఉపన్యాసాలు ఇచ్చారు. యోగాసనాలు ప్రదర్శించారు. విదేశీ ఉపాధ్యాయులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్ని ఎంతగానో కొనియాడారు. స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయులు పి. హరికృష్ణ నిర్వహించగా, హెచ్‌ఎం మాచర్ల మోహన్‌రావు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

బాపట్లటౌన్: పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన ఎం అజయ్‌కుమార్(28) డీజే బాక్సులు బిగించే పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 13వ తేదీన మండల పరిధిలోని ముత్తయ్యపాలెం గ్రామంలో జరిగిన తిరునాళ్లలో నెలకొల్పిన బాక్స్‌లు తిరిగి తీసుకువచ్చేందుకు గురువారం కొందరు కూలీలతో కలిసి వెళ్లాడు. బాక్సులు తరలిస్తున్న సమయంలో మీద పడటంతో అజయ్‌కుమార్ అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం తరలించగా ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లూరుపాలెం హైస్కూలు పూర్వ విద్యార్థికి ప్రశంసాపత్రం



కలెక్టర్ అనుదీప్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అఖిల్‌చంద్ర

రేపల్లె రూరల్: తెలంగాణ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఇన్నోవేషన్ హబ్ ఇటీవల నిర్వహించిన 'ఇన్నోవేషన్ థాట్స్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటక్షన్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'లో రేపల్లె మండలం నల్లూరుపాలెం జెడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థి లచ్చి అఖిల్‌చంద్ర ప్రతిభ కనపరిచాడు. అతడు ప్రస్తుతం హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో గురువారం జరిగిన వేడుకల్లో హైదరాబాద్ కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ నుంచి అఖిల్‌చంద్ర ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న శకటాలు

బాపట్ల : స్థానిక పోలీస్ కవాతు మైదానంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రగతిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యుత్ శాఖ అధికారులు రూపొందించిన శకటానికి ప్రథమ బహుమతిని మంత్రి రవికుమార్ ప్రకటించారు. గృహ నిర్మాణ శాఖ శకటానికి ద్వితీయ, విద్యాశాఖకు తృతీయ, అన్న క్యాంటీన్లపై మున్సిపల్ శాఖ రూపొందించిన శకటానికి ప్రోత్సాహక బహుమతిని ఆయన అందించారు. పౌర సరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థ శకటం, పశు సంవర్ధక, మత్స్య శాఖ కలిసి రూపొందించిన శకటాలు ఆకట్టుకున్నాయి. ఉద్యానం, ఏపీ ఎంఐపీ శాఖల శకటం, వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, డ్వామా, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖలు శకటాలు ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. రెడ్‌క్రాస్ సేవలపై ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. జాతీయ భక్తి గీతాలకు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహూతుల్ని అలరించాయి. నర్సాయపాలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సారే జహాసే అచ్చా నృత్యం, బాపట్ల ఎస్ఎంజీ జూనియర్ కళాశాల, రేపల్లె ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్యాంబో డాన్స్, చీరాల కేజీబీవీ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన 17 స్టాల్స్‌ను మంత్రి గొట్టిపాటి రవి కుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, బాపట్ల, చీరాల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, ఎం. మాలకొండయ్య, ఎస్పీ తుషార్ డూడీ, సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు కలిసి తిలకించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం



వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం



అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం

ఆపదలో ఉన్నవారికి పార్టీ అండగా ఉంటుంది

డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: ఆపదలో ఉన్న ప్రతి వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉండి, ఆదుకుంటుందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అన్యాయంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. మండల పరిధిలోని రాంబొట్లవారి పాలెం గ్రామానికి చెందిన చెందిన చేబ్రోలు రాజ్‌కుమార్ కుటుంబ సభ్యుల్ని అదే గ్రామానికి చెందిన టీడీపీ గూండాలు విచక్షణరహితంగా కొట్టి, తీవ్రంగా గాయపరిచారు. సంఘటనను తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ. 50వేల చెక్కును పంపించారు. దాన్ని డాక్టర్ ఈవూరి గణేష్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించి, జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి, కాశీ ప్రభాకర్, ఎనుముల వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్

డెంగీ లక్షణాలతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి



లక్ష్మి (ఫైల్)

బాపట్ల టౌన్: డెంగీ లక్షణాలతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందిన సంఘటన మండలంలోని ముత్తాయపాలెంలో చోటు చేసుకుంది. గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్న జంపాని లక్ష్మి (42) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈనెల 12 తొలుత బాపట్లలోని మైత్రి హాస్పిటల్‌లో చేరింది. అక్కడి నుంచి చీరాల గోరంట్ల వైద్యశాలలో చికిత్స పొందింది. అప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో ఈనెల 13న గుంటూరులోని అమరావతి వైద్యశాలలో చేరింది. డెంగీ లక్షణాలు ఉన్నాయని, ప్లేట్‌లెట్ కౌంట్ పూర్తిగా తగ్గిందని వైద్యులు చెప్పారు. మెరుగైన చికిత్స కోసం అమరావతి వైద్యశాల నుంచి ఈనెల 13 రాత్రి గుంటూరులోని రమేష్ హాస్పిటల్‌లో కుటుంబ సభ్యులు చేర్చారు. అక్కడే చికిత్స పొందుతూ లక్ష్మి మృతి చెందింది. మృతురాలికి భర్త ప్రముఖ ఫొటోగ్రాఫర్ పి.వి.ఎస్. నాగరాజు, కుమారుడు పవన్ ఉన్నారు. లక్ష్మి భౌతికాయానికి మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పూలమాలలేసి నివాళులర్పించారు. బాపట్ల పట్టణ, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ముత్తాయపాలెంలోని నివాసానికి చేరుకొని ఆమె భౌతికకాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం భౌతికకాయానికి కుటుంబసభ్యులు ముత్తాయపాలెం శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేశారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పోలీసు కార్యాలయాల్లో జెండావందనం

నగరంపాలెం: ఎందరో మహానుభావులు, స్వాతంత్య్ర సమరయోధుల పోరాటం ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం లభించిందని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు గురువారం గుంటూరు నగరంలోని రేంజ్ ఐ.జి కార్యాలయంలో జరిగాయి. రేంజ్ ఐజీ జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు అందించారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీ (ఏఆర్) శాంతకుమార్, ఆర్ఐలు శ్రీనివాసరావు, శ్రీహరిరెడ్డి, బ్రహ్మానందం, మినిస్టీరియల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనేక మంది అమరవీరుచ చేసిన త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని జిల్లా ఎస్పీ అన్నారు. అనంతరం మిఠాయిలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు నిచికేత్‌షెల్కే (గుంటూరు తూర్పు), జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, ఎస్‌బీ సీఐ ఆనంద్, ఆర్ఐలు శ్రీనివాసరావు, హరిరెడ్డి, బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్య్రం

పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

కొరిటిపాడు(గుంటూరు): ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్య్రం వచ్చిందని, వాటి ఫలాలను పరిరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారత పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబులు పేర్కొన్నారు. జీటీ రోడ్‌లోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని చైర్మన్ యశ్వంత్‌కుమార్ ఆవిష్కరించారు. యశ్వంత్‌కుమార్, శ్రీధర్‌బాబులు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఫలాలు పేదలకు అందించినప్పుడే ఉద్యమవీరుల త్యాగం సార్థకం అవుతోందన్నారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతలు, విధులను నిర్వర్తించి దేశ పురోభివద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. పొగాకు బోర్డులో అందరి సమిష్టి కృషి, టీం వర్క్ ఫలితంగా పొగాకు వేలం అమ్మకాలను విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి పొగాకు బోర్డు ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు తమ తమ విధులను ఘనంగా నిర్వహించారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ దేశం, దేశ భక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 78 సంవత్సరాల స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల జ్ఞాపకార్థం, పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం ఆవరణలో ఇంటర్, పదవ తరగతిలలో అత్యధిక మార్కులు సాధించిన పొగాకు బోర్డు సిబ్బంది సభ్యులకు బహుమతులను అందజేశారు. అంతేకాకుండా బోర్డు సిబ్బందికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న చెర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్

పరేడ్ గ్రౌండ్స్‌లో డ్రోన్ కలకలం

- అనుమతులు లేకుండా డ్రోన్ ఎగురవేసిన యూట్యూబర్
- ఒక్కసారి అలజడి వాతావరణం
- స్టేషన్ తరలించి విచారించిన పోలీసులు
- యూట్యూబర్ అని తేల్చి పంపించిన నగరంపాలెం పోలీసులు

పట్నంబజారు: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఒక యూట్యూబర్ ఎటువంటి అనుమతులు లేకుండా చేసిన పని కలకలం రేపింది. పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలో నందిని అనే ఓ యూట్యూబర్ ఎటువంటి అనుమతులు లేకుండా పరేడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్య్ర వేడుకలు చిత్రీకరించేందుకు డ్రోన్ వినియోగించింది. దీంతో అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గ్రౌండ్స్‌లో అలజడి వాతావరణం ఏర్పడింది. విఐపీలు అధికంగా ఉన్న వేళ అనుమతులు లేకుండా నందిని డ్రోన్ ఎగురువేసిన నేపథ్యంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని డ్రోన్ స్వాధీనం చేసుకున్నారు. నగరంపాలెం పోలీసుస్టేషన్ తరలించి విచారించారు. అనంతరం ఆమె యూట్యూబర్ అని తెలుసుకుని, అనుమతులు లేకుండా ఇటువంటి కార్యక్రమాలు చిత్రీకరించకూడదని సూచించి పంపించివేశారు. నందిని తండ్రి బొల్లాపల్లి పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.